సాక్షి
ఆదిలాబాద్
మంగళవారం । 30 । జనవరి । 2024



ఎక్సైజ్‌లో బదిలీల హడావుడి

ఎక్సైజ్‌లో బదిలీల హడావుడి మొదలైంది. ప్రస్తుతం ఆ శాఖలో ఎవరిని అడిగినా స్థాన చలనం గురించే ప్రస్తావిస్తున్నారు.

10లో▸



ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలి

సీఎం పర్యటన నేపథ్యంలో కేస్లాపూర్‌లో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఏర్పాట్లను పరిశీలించారు.

10లో▸

గరిష్ఠం/కనిష్ఠం
30.0 /17.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమశాతం పెరగనుంది. ఉదయం పొగమంచు ప్రభావం కనిపిస్తుంది.

న్యూస్‌రీల్

ఈకేవైసీ గడువు పొడిగింపు

కైలాస్‌నగర్: ఇప్పటి వరకు ఈకేవైసీ నమోదు చేసుకోలేని రేషన్ కార్డుదారులకు కేంద్ర ప్రభుత్వం ఊరట కల్పించింది. నమోదు గడువును ఫిబ్రవరి నెలాఖరు వరకు పొడిగించింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం నుంచి జిల్లా పౌరసరఫరాల శాఖ కార్యాలయానికి ఉత్తర్వులు అందాయి. ఈ నెల 31వ తేదీతో గడువు ముగియనుండటంతో తమ పరిస్థితి ఏంటని ఆందోళన చెందిన కార్డుదారులకు ప్రయోజనం కల్పించేలా ఈ నిర్ణయం తీసుకుంది. ఆధార్ కార్డుల అప్‌డేషన్ లేక మిగిలిపోయిన కార్డుదారులంతా ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఎస్‌వో టి.కిరణ్‌కుమార్ సూచించారు. గడువులోగా తమ పరిధిలోని రేషన్ డీలర్ల వద్ద కార్డులోని సభ్యులంతా ఈకేవైసీ వివరాలు నమోదు చేసుకోవాలని కోరారు.

ఎంపికైన స్టాఫ్‌నర్సులకు ఐడీకార్డులు



ఐడీకార్డు అందజేస్తున్న డీఎంహెచ్‌వో రాథోడ్ నరేందర్

కైలాస్‌నగర్: జిల్లాలో స్టాఫ్‌నర్సులుగా ఎంపికైన అభ్యర్థులకు ఈ నెల 31న హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా పోస్టింగ్ ఆర్డర్ అందజేయనున్నారు. ఈ మేరకు వారిని రాష్ట్ర రాజధానికి తరలించేందుకు వైద్యారోగ్యశాఖ అధికారులు చర్యలు చేపట్టారు. ఉద్యోగానికి ఎంపికైన అభ్యర్థులతో ఆ శాఖ కార్యాలయంలో సోమవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అక్కడికి వెళ్లేందుకు గాను వారికి అవసరమైన ఐడీ కార్డులను డీఎంహెచ్‌వో రాథోడ్ నరేందర్ అందజేశారు. అలాగే అభ్యర్థులకు పలు సూచనలు చేశారు. ఎంపికైన వారిలో అత్యధిక మందికి జిల్లాలోనే పోస్టింగ్ వచ్చే అవకాశముందన్నారు. కాగా, వారిని తరలించేందుకు ఆరు బస్సులను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఐవో వైసీ.శ్రీనివాస్, సూపరింటెండెంట్లు శ్రీకాంత్, గోపి తదితరులు పాల్గొన్నారు.

రెండు సబ్‌సెంటర్లకు ఎన్‌క్వాస్ గుర్తింపు

కైలాస్‌నగర్: జిల్లాలోని రెండు హెల్త్ సబ్‌సెంటర్లకు ఎన్‌క్వాస్(నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్డ్) గుర్తింపు లభించింది. తాంసి మండలంలోని నిపాని,మావల మండలంలోని వాగాపూర్ ఆరోగ్య ఉప కేంద్రాలు ఈ గుర్తింపును పొందాయి. ఢిల్లీ నుంచి వచ్చిన కేంద్ర బృందం ఈనెల 16, 17తేదీల్లో ఆయా కేంద్రాలను పరిశీలించింది. నిపాని కేంద్రానికి 94.19 మార్కులు రాగా, వాగాపూర్ కేంద్రం 94.09 మార్కులను కేటాయించింది. ఆరోగ్య పరంగా రోగులకు అందిస్తున్న సేవలు, పరిశుభ్రతకు గాను ఎన్‌క్వాస్ ఈ అవార్డుకు రెండు సబ్‌సెంటర్లను ఎంపిక చేస్తూ కేంద్ర వైద్య, ఆరోగ్యశాఖ ప్రకటించింది. ఈ మేరకు సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. దీంతో ఒక్కో సెంటర్‌కు ఏడాదికి రూ.3లక్షల చొప్పున కేంద్ర నిధులు రానున్నాయి. గుర్తింపు దక్కడంపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో పాటు ఆయా కేంద్రాల పీహెచ్‌సీల వైద్యులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆగని భూదందా



మావల మండల కేంద్ర సమీపంలోని సర్వేనం.170లోని అసైన్డ్ భూమి ఇది. అత్యంత విలువైనది కావడంతో దీనిపై కన్నేసిన కొందరు కబ్జా చేశారు. దొడ్డిదారిన లేఅవుట్ సిద్ధం చేసి ప్లాట్‌ను రూ.10లక్షల నుంచి రూ. 12లక్షలకు విక్రయించి సొమ్ము చేసుకున్నా రు. ఈ అక్రమ దందాకు అధికారుల అండదండలున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి.



ఇక్కడ కనిపిస్తున్నది ఆదిలాబాద్ పట్టణంలోని సుభాష్‌నగర్ కాలనీ వెనుకాల గల ఏళ్లనాటి వాగు. దీనికి ఆనుకుని ఉన్న లేఅవుట్ దారుడు దీనిపై కన్నేశాడు. ఇంకేముంది వాగును సైతం మొరం, మట్టితో పూడ్చివేసి తన లేవుట్‌లో కలుపుకుని ప్లాట్లను సిద్ధం చేశాడు. వాగు గుండా వచ్చే నీటిని మళ్లించేలా పొక్లెయిన్లతో చిన్నపాటి కాలువ తవ్వాడు. ఒక్కో ప్లాట్‌ను రూ.20లక్షల చొప్పున విక్రయించేస్తున్నాడు.

- రెచ్చిపోతున్న భూ బకాసురులు
- అసైన్డ్ భూములు, వాగుల కబ్జా
- 'మామూలు'గా వ్యవహరిస్తున్న అధికారులు

కైలాస్‌నగర్: జిల్లా కేంద్రంలో అక్రమ భూదందా ఏ విధంగా సాగుతుందనేందుకు ఇవి కేవలం ఉదాహరణలు మాత్రమే. పట్టణంలో ఎటు చూసినా ఇలాంటి పరిస్థితులే కనిపిస్తున్నాయి. భూ అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. అసైన్డ్ భూమా, వాగులా, ప్రభుత్వ భూమా అనే దాంతో సంబంధం లేకుండా ఖాళీ స్థలం కనిపిస్తే చాలు కబ్జా చేసేస్తున్నారు. దర్జాగా భూములను ఆక్రమించేస్తున్నారు. గుట్టు చప్పుడు కాకుండా వాటిని లేఅవుట్లుగా మార్చి ప్లాట్లను విక్రయిస్తున్నారు. అనతికాలంలోనే కోట్లకు పడగలెత్తుతున్నారు. ఇలాంటి ఆక్రమణలను కట్టడి చేయాల్సిన కొంతమంది బల్దియా అధికారులు 'మామూలు'గా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. దీంతో అక్రమార్కుల ఆగడాలు మితిమీరుతున్నాయి.

ఖాళీ జాగా కనిపిస్తే చాలు కబ్జా..

పట్టణంలో భూముల ధరలకు రెక్కలొచ్చాయి. రియల్ వ్యాపారం జోరుగా సాగుతోంది. రూ.10లక్షల నుంచి రూ.15లక్షలు పెడితే తప్ప ఒక్క ప్లాటు లభించని పరిస్థితి. దీన్ని ఆసరాగా చేసుకున్న భూ బకాసురులు పట్టణంలో ఖాళీ స్థలం కనిపిస్తే చాలు వాటిపై గద్దల్లా వాలిపోతున్నారు. ప్రభుత్వ, అసైన్డ్ వంటి ఎలాంటి భూములను వదలట్లేదు. ముఖ్యంగా రూ.కోట్లలో ధర పలుకుతున్న మావల మండల కేంద్రంలోని సర్వేనంబర్ 170, 172 లల్లో ఈ దందా ఎక్కువగా సాగుతోంది. దీంతో పాటు బంగారుగూడ, ఎంప్లాయిస్ కాలనీ, చాందా(టి)సమీపంలో, ఇందిరమ్మ కాలనీని ఆనుకుని, మావల మండలకేంద్రం, రాంనగర్, దుర్గానగర్ వంటి తదితర ప్రాంతాల్లోని ప్రభుత్వ, అసైన్డ్ భూములు అన్యాక్రాంతమవుతున్నాయి. రాజకీయ అండదండలతో వాటిని కబ్జా చేస్తున్న అక్రమార్కులు అందినకాడికి సొమ్ము చేసుకుంటున్నారు.

పట్టించుకోని అధికారులు

భూ అక్రమణలను కట్టడి చేసి, ప్రభుత్వ, అసైన్డ్ భూములను కాపాడాల్సిన బల్దియా, రెవెన్యూ అధికారులు ప్రేక్షకపాత్రకే పరిమితమవుతున్నారనే విమర్శలున్నాయి. అక్రమాలను అడ్డుకోవాల్సిన ఆయా శాఖల్లోని కొంతమంది అధికారులే కాసులకు కక్కుర్తి పడి భూ బకాసురులకు వంత పాడుతున్నారనే విమర్శలు లేకపోలేదు. మరికొంతమంది అవినీతి అధికారులు ప్రభుత్వ, అసైన్డ్ భూముల వివరాలతో కూడిన సమాచారాన్ని అక్రమార్కులకు అందజేయడంతో పాటు వాటిని ఎలా కబ్జా చేయాలి, ప్రభుత్వపరంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండాలంటే ఏ విధంగా వ్యవహరించాలనే దానిపై వారికి సూచనలందిస్తూ పెద్ద మొత్తంలో వాటాలు అందుకుంటున్నట్లుగా పట్టణంలో చర్చ సాగుతోంది.

కఠినంగా వ్యవహరిస్తాం



ప్రభుత్వ అసైన్డ్, మున్సిపల్ స్థలాలను అక్రమించినట్లుగా ఇప్పటి వరకు మా దృష్టికి రాలేదు. అలాంటి వాటిపై ఫిర్యాదు చేస్తే శాఖాపరంగా కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రణాళిక విభాగం అధికారులను పంపించి అక్రమణలపై విచారణ జరిపిస్తాం. వాస్తవమని తేలితే బాధ్యులపై చట్టపరంగా చర్యలతో పాటు ఆ స్థలాలను తిరిగి స్వాధీనం చేసుకుంటాం.

– ఏ.శైలజ, మున్సిపల్ కమిషనర్

విన్నపాల వెల్లువ

- ప్రజావాణిలో అర్జీలు స్వీకరించిన అదనపు కలెక్టర్



అర్జీలు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ శ్యామలాదేవి

కైలాస్‌నగర్: ప్రజావాణిలో అందించే దరఖాస్తుల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ శ్యామలాదేవి అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌కు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి భారీగా తరలివచ్చారు. వారి నుంచి ఆమె అర్జీలు స్వీకరించడంతో పాటు సమస్యలు అడిగి తెలుసుకున్నారు. దరఖాస్తులను సంబంధిత అధికారులకు అందజేస్తూ సత్వరం పరిష్కరించాల్సిందిగా ఆదేశించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో గణపతి, ఆర్డీవో స్రవంతి, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు. ఈ వారం అర్జీదారుల్లో కొందరి నివేదన వారి మాటల్లోనే...

డీడీ డబ్బులైనా వెనక్కివ్వండి



గత ప్రభుత్వం గొల్ల, కురుమల కోసం చేపట్టిన గొర్రెల పంపిణీ పథకంలో గ్రామానికి చెందిన 80 మంది యాదవులం 2022 సెప్టెంబర్‌లో ఒక్కొక్కరం రూ.43,950 చొప్పున డీడీలు చెల్లించాం. చేతిలో డబ్బుల్లేకపోయినా గొర్రెలు వస్తాయనే ఆశతో అప్పు చేసి మరీ డీడీలు కట్టాం. ఇప్పటి వరకు ప్రభుత్వం గొర్రెలను పంపిణీ చేయలేదు. అలాగే పంపిణీపై ఎలాంటి స్పష్టత లేదు. గొర్రెలనైనా పంపిణీ చేయాలి లేదంటే మేం కట్టిన డీడీ డబ్బులైనా వెనక్కివ్వాలి.

– యాదవ కులస్తులు, భరంపూర్, తలమడుగు

ఇంటిస్థలం తనదంటూ బెదిరిస్తున్నడు..



గత కాంగ్రెస్ ప్రభుత్వం 2013లో సర్వే నంబర్ 170లో నా పేరిట ఇంటి స్థలాన్ని కేటాయిస్తూ 721 నంబర్‌తో పట్టా జారీ చేసింది. ఆ స్థలంలో పునాది కూడా నిర్మించుకున్నా. పేదరికంతో పూర్తిగా ఇంటిని నిర్మించుకోలేపోయా. అయితే ఇటీవల ఓ వ్యక్తి వచ్చి ఆ స్థలం తనదంటూ బెదిరిస్తున్నడు. నాకు న్యాయం చేయాలని కోరుతున్నా.

– కాలే శశికళ, రాంనగర్

పట్టా కోసం తిరుగుతున్న..



ఆదిలాబాద్ పట్టణం బెల్లూరి శివారు సర్వేనంబర్ 56లో మా ముగ్గురు సొదరుల పేరిట ఎకరంనర భూమి ఉంది. దానికి పట్టా చేసి ఇవ్వాలని కొన్నేళ్లుగా రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతూనే ఉన్నా. అధికారులు మారుతున్నారే తప్ప పట్టా మాత్రం ఇవ్వడం లేదు. ఉన్నతాధికారులైనా స్పందించి పట్టా ఇప్పించి ఆదుకోవాలని విన్నవించిన.

– కర్రెన్న లింగన్న, బెల్లూరి

కబ్జా స్థలాన్ని కాపాడండి



ఎంప్లాయిస్ కాలనీలోని వివిధ లే అవుట్లలో ఆలయాలు, పార్కులు, ప్రభుత్వ అవసరాల కోసం కేటాయించిన స్థలాలను అక్రమార్కులు కబ్జాకు పాల్పడి ప్లాట్లుగా మార్చుకుంటున్నారు. ఇందులో కొన్ని ప్లాట్లలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టకుండానే ఇంటి నంబర్లు కూడా కేటాయించారు. దీంతో భవిష్యత్తులో ప్రభుత్వ అవసరాలకు స్థలాలు లేకుండా పోయే ప్రమాదముంది. కబ్జాదారుల నుంచి ఆ స్థలాలను పరిరక్షించాలి.

– ఎంప్లాయిస్ కాలనీవాసులు, ఆదిలాబాద్

వృత్తి నైపుణ్యం మెరుగుపర్చుకోవాలి

- ఎస్పీ గౌస్ ఆలం



మాట్లాడుతున్న ఎస్పీ గౌస్ ఆలం

ఆదిలాబాద్‌టౌన్: పోలీసులు వృత్తి నైపుణ్యాన్ని మెరుగుపర్చుకోవాలని ఎస్పీ గౌస్ ఆలం అన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో ఈనెల 18 నుంచి ఫిబ్రవరి 1వరకు నిర్వహిస్తున్న మొబిలైజేషన్ కార్యక్రమానికి సోమవారం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పోలీసు ఉద్యోగం క్రమశిక్షణతో కూడుకున్నదని తెలిపారు. వార్షిక మొబిలైజేషన్‌లో భాగంగా సిబ్బందికి లాఠీ డ్రిల్, మాబ్ ఆపరేషన్, ఫైరింగ్, రైట్‌గేర్ ఎక్విప్మెంట్ వినియోగంపై అవగాహన, టియర్ గ్యాస్, గ్యాస్‌గన్ వినియోగం, సిబ్బంది ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్, వెల్ఫేర్ తదితర అంశాలపై అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ శిక్షణను రిజర్వు సిబ్బంది వినియోగించుకోవాలని సూచించారు. ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని, వాటిని పరిష్కరించే దిశగా కృషి చేస్తానని పేర్కొన్నారు. సిబ్బంది ప్రతిరోజు క్రమం తప్పకుండా వ్యాయామం చేస్తూ శారీరక దృఢత్వాన్ని కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు నవీన్, మురళి, రిజర్వ్ సబ్ ఇన్‌స్పెక్టర్లు, రిజర్వ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నర్సన్నబాపు.. ఇకలేడు

- మంత్రిగా, పీసీసీ అధ్యక్షుడిగా ఉమ్మడి జిల్లాకు సేవలందించిన నర్సారెడ్డి
- కొంతకాలంగా మంచానికే పరిమితం
- హైదరాబాద్‌లో కన్నుమూసిన పొద్దుటూరి
- నివాళులర్పించిన సీఎం, ఇన్‌చార్జి మంత్రి
- కుటుంబానికి పరామర్శల వెల్లువ

నిర్మల్/సారంగపూర్: నర్సన్నబాపు.. ఈ తరానికి పెద్దగా పరిచయం లేకున్నా.. తమ తండ్రులు, తాతలకు మాత్రం బాగా దగ్గరి బంధమున్న పేరు. నిస్వార్థ సేవకుడిగా, రాజకీయ వారసత్వం పంచని నేతగా, ఎన్నో అభివృద్ధి కార్యక్రమాల ప్రదాతగా ఇప్పటికీ ప్రజల్లో నిలిచి ఉన్న రాజకీయ దిగ్గజం ఆయన. అలాంటి మహానేత పొద్దుటూరి నర్సారెడ్డి సోమవారం వేకువజామున కన్నుమూశారు. హైదరాబాద్‌లోని తన నివాసంలోనే వృద్ధాప్యం, అనారోగ్యంతో తుదిశ్వాస విడిచారు. రైతుకుటుంబంలో పుట్టి ఉన్నతవిద్య అభ్యసించి, తెలంగాణ విముక్తి కోసం పోరాడి, రాజకీయవేత్తగా ఎదిగి ప్రజలకు ఆప్తుడిగా మారిన నర్సన్నబాపును జిల్లా యాది చేసుకుంది. 'నీలాంటి నేతలు మళ్లీ దొరకరంటూ.. నర్సన్న ఇక సెలవంటూ..' నివాళులర్పించింది

ఉన్నతవిద్య చదివి..

నిర్మల్ జిల్లా సారంగపూర్ మండలం మలక్‌చించోలికి చెందిన పొద్దుటూరి గంగారెడ్డి ఏకైక సంతానం నర్సారెడ్డి. 1931 సెప్టెంబర్ 22న జన్మించారు. ఓయూలో బీఏ, ఎల్ఎల్‌బీ చదివారు. యుక్తవయసులోనే స్వాతంత్ర్యసమరంలో,నిజాంపాలననుంచి హైదరాబాద్ విముక్త పోరాటంలోనూ పాల్గొన్నారు.

రాజకీయాల్లో చేరి..



భారత జాతీయ కాంగ్రెస్‌లో చేరిన నర్సారెడ్డి వివిధ పదవులు, హోదాల్లో పనిచేశారు.

- 1971 నుంచి 1972వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పీసీసీ అధ్యక్షుడిగా సేవలందించారు.
- 1978 ఎన్నికల తర్వాత అప్పటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావు మంత్రివర్గంలో నీటిపారుదల శాఖ, రెవెన్యూ శాఖ, శాసనసభా వ్యవహారా ల శాఖమంత్రిగా పనిచేశారు.
- వరుసగా 1967నుంచి 1982వరకు మూడు పర్యాయాలు గెలిచి హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా పనిచేశారు.
- 1991లో ఆదిలాబాద్ ఎంపీగా, ఒకసారి ఆంధ్రప్రదేశ్ శాసనమండలి సభ్యుడిగా పనిచేశారు.

వ్యవసాయమంటే ఇష్టం..

నిర్మల్ నియోజకవర్గంతో పాటు ఉమ్మడి జిల్లా అభివృద్ధిలో నర్సన్నబాపు తనదైన ముద్రవేశారు. ప్రధానంగా ఇక్కడ ఉన్నత విద్య కోసం జూనియర్, డిగ్రీ కాలేజీలు ఏర్పాటు చేయించారు. ఏకైక సంతానమైన నర్సారెడ్డి పుట్టిన కొంతకాలానికే తండ్రి గంగారెడ్డి మరణించారు. దీంతో ఆయన తన చిన్నాన్న, చిన్నమ్మల వద్ద పెరిగారు. రైతుకుటుంబం నుంచి వచ్చిన నర్సారెడ్డికి వ్యవసాయం అంటే అమితాసక్తి. ఈయన హయాంలోనే మలక్‌చించోలిలో వంతెన, స్వర్ణ ప్రాజెక్టు నిర్మాణం చేపట్టారు.

రాజకీయ వారసులు లేని నేత..

నర్సారెడ్డికి కౌసల్యాదేవితో వివాహమైంది. వీరికి ముగ్గురు కుమారులు. సుదర్శన్‌రెడ్డి, మధుసూదన్ రెడ్డి, సంజీవ్‌రెడ్డి, కుమార్తె విజయలక్ష్మి ఉన్నారు. వీరంతా వృత్తిరీత్యా విదేశాల్లో ఉంటున్నట్లు బంధుమిత్రులు తెలిపారు. మంత్రిగా, పీసీసీ అధ్యక్షుడిగా, ఎంపీగా చేసిన నర్సారెడ్డి కుటుంబం నుంచి రాజకీయ వారసులు లేకపోవడం విశేషం. ఆయన కుమారులెవరూ రాజకీయాల వైపు రాకపోవడం గమనార్హం. నర్సారెడ్డి తెలంగాణ అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా, నిబంధనల కమిటీ, ప్రభుత్వ హామీల కమిటీ, విజ్ఞాపనల కమిటీ, సంప్రదింపుల కమిటీల సభ్యుడిగానూ పనిచేశారు. నిర్మల్‌లోని బుధవార్‌పేట్‌లో గల తన నివాసంలో కొంతకాలం ఉన్న తర్వాత ఆయన ఆరోగ్యం సహకరించకపోవడంతో హైదరాబాద్ నివాసానికి వెళ్లారు. ప్రస్తుతం అక్కడే ఆయన తుదిశ్వాస విడిచారు.

మండల ప్రజల దిగ్భ్రాంతి

సారంగపూర్ మండలంలోని ప్రతీగ్రామం నుంచి ఆయనకు సన్నిహితులు, సంబంధీకులున్నారు. వీరందరికీ నర్సన్నబాపుతో విడదీయలేని అనుబంధం ఉంది. ఆయన హయాంలోనే ప్రస్తుతమున్న సీనియర్ నేతలంతా రాజకీయ ఓనమాలు దిద్దారు.

వచ్చిరాని వైద్యం..!

రోగుల ప్రాణాలతో చెలగాటం

- కొంతమంది ఆర్ఎంపీల నిర్వాకం
- క్లినిక్‌లు ఏర్పాటు చేసి మరీ వైద్యసేవలు
- అర్హత లేకున్నా డాక్టర్లుగా చెలామణి
- చర్యలకు సిద్ధమవుతున్న వైద్యశాఖ



అర్హత లేకుండా వైద్యం చేస్తున్న ఆర్ఎంపీ, పీఎంపీలపై చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌వోకు వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకుడు రూపేశ్‌రెడ్డి (ఫైల్)

ఆదిలాబాద్‌టౌన్: ఆర్ఎంపీల వచ్చిరాని వైద్యం రోగుల పాలిట శాపంగా మారుతోంది. పేదల అవసరాన్ని ఆసరాగా చేసుకొని అందినకాడికి దండుకుంటున్నారు. ఏకంగా క్లినిక్‌లు ఏర్పాటు చేయడంతో పాటు మెడికల్ షాప్, రక్త పరీక్షలు, పడకలు ఏర్పాటు చేసి వైద్యం అందిస్తున్నారు. నిబంధనల ప్రకారం ఆర్ఎంపీలు కేవలం ప్రథమ చికిత్స మాత్రమే అందించాలి. అయితే జిల్లాలో దీనికి భిన్నంగా వ్యవహరిస్తున్నారు. ఎంబీబీఎస్ పూర్తి చేసిన వారే పేరుకు ముందు డాక్టర్ అని పెట్టుకోవాల్సి ఉంటుంది. కనీసం పదో తరగతి ఉత్తీర్ణులు కానీ కొంత మంది ఆర్ఎంపీలు తమ పేరు ముందు డాక్టర్ అని పెట్టుకుని వైద్య సేవలు అందిస్తున్నారు. వీరి నిర్లక్ష్యం కారణంగా గతంలో అనేక మంది ప్రాణాలు కోల్పోయి ఘటనలున్నాయి. అయినప్పటికీ వీరి తీరులో మార్పు కానరావడం లేదు. అయితే నకిలీ డాక్టర్లకు చెక్ పెట్టేందుకు రాష్ట్ర వైద్య మండలి నిర్ణయం తీసుకుంది. అర్హత లేకున్నప్పటికీ ప్రాక్టీస్ చేసేవారిపై చర్యలు తీసుకునేందుకు సిద్ధమయ్యారు.

ఊరూరుకు తిరుగుతూ..

జిల్లాలో వందల సంఖ్యలో ఆర్ఎంపీలు, పీఎంపీలు ఉన్నారు. ఆయా మండలాల్లోని గ్రామాల్లో క్షేత్రస్థాయిలో ప్రతిరోజు తిరుగుతూ రోగులకు ఇంజక్షన్లు, మాత్రలు ఇవ్వడంతో పాటు సెలైన్‌లు సైతం ఎక్కిస్తున్నారు. పల్లె ప్రజలకు వైద్యం ఖర్చుతో కూడుకున్నది కావడంతో వారు ఇంటికి వచ్చిన ఆర్ఎంపీతోనే వైద్య సేవలు పొందుతున్నారు. ఒక్కోసారి వైద్యం వికటించి అవస్థలు పడుతున్న ఘటనలు అనేకంగా చోటుచేసుకున్నాయి. చేతులు, కాళ్లు వాపు రావడం, డోస్ ఎక్కువగా ఉండడంతో చర్మంపై దద్దుర్లు, ఇతర ఇన్‌ఫెక్షన్లు అవుతున్నాయి. ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాల్లో వీరి ఆగడాలు మితిమీరుతున్నాయి. ప్రభుత్వం గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్యసేవలు అందించేందుకు స్థానికంగా పల్లె దవాఖానాలు, ఆరోగ్య కేంద్రాలు, ఉప కేంద్రాలను ఏర్పాటు చేసింది. అయితే కొంత మంది సర్కారు ఆస్పత్రులకు వెళ్లకుండా వీరి వద్దనే వైద్యం పొందుతున్నారు. ఇక బెంగాల్‌లో ఆర్ఎంపీలుగా కొనసాగుతున్న పలువురు ఏటా వర్షాకాలంలో జిల్లాలోని బేల మండలానికి వచ్చి మరీ వైద్యం అందిస్తున్నారు. మోకాళ్ల నొప్పుల కోసం ఇంజక్షన్‌లు ఇస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. ఇదే కాకుండా ఇతర దీర్ఘకాలిక రోగాలు, అబార్షన్లు, గర్భిణులు, ఇతర ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారిని తమకు అనుకూలంగా ఉన్న ప్రైవేట్ ఆస్పత్రులకు తరలిస్తున్నారు. వారి నుంచి కమీషన్లు తీసుకుంటున్నారు. నిత్యం వీరు గ్రామాల్లో తిరగడంతో ప్రజలతో సత్సంబంధాలు ఉండడంతో వీరు చెప్పిన ఆస్పత్రికి వెళ్తున్నారు.

చర్యలకు సిద్ధమవుతున్న వైద్యశాఖ..

నిబంధనలకు విరుద్ధంగా డాక్టర్లుగా చెలామణి అవుతున్న ఆర్ఎంపీ, పీఎంపీలపై వైద్యారోగ్య శాఖ ఎట్టకేలకు చర్యలకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. అర్హత లేకున్నప్పటికీ ప్రాక్టీస్ చేసేవారు, నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్ ఆస్పత్రులను నిర్వహిస్తున్న వారిపై కొరడా ఝళిపించేందుకు సన్నద్ధమవుతుంది.

క్లినిక్‌లు ఏర్పాటు చేసుకొని..

కొంతమంది ఆర్ఎంపీలు, పీఎంపీలు మండల కేంద్రాలు, గ్రామీణ ప్రాంతాలతో పాటు జిల్లా కేంద్రంలో సైతం క్లినిక్‌లు ఏర్పాటు చేసి వైద్యం చేస్తున్నారు. అర్హత లేకున్నప్పటికీ ప్రాక్టీస్ చేస్తూ రోగుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. జిల్లా కేంద్రంలో ఎంబీబీఎస్ డాక్టర్లు, పీజీ చేసిన వైద్యులు సైతం ఉన్నప్పటికీ వీరి క్లినిక్‌లు మాత్రం ఎప్పుడు చూసినా కిటకిటలాడుతున్నాయంటే అతిశయోక్తి లేదు. దీనికి కారణం లేకపోలేదు. పేదలు ఎక్కువ మొత్తంలో వైద్య ఖర్చులు భరించలేని పరిస్థితి. వీరి అవసరాన్ని ఆర్ఎంపీ, పీఎంపీలు ఆసరాగా చేసుకుంటున్నారు. క్లినిక్‌లో ప్రిస్క్రిప్షన్ రాసి అక్కడే వారు ఏర్పాటు చేసుకున్న మెడికల్ షాపులో మందులను సైతం విక్రయిస్తున్నారు. అలాగే కొంత మంది రోగుల బ్లడ్ శాంపిళ్లు తీసుకొని స్వయంగా రక్త, మూత్ర, తదితర పరీక్షలు నిర్వహిస్తూ వారి నుంచి డబ్బులు పెద్ద మొత్తంలో వసూలు చేస్తున్నారు. మరోవైపు కీళ్ల నొప్పులు, కడుపు నొప్పి, ఒంటి నొప్పులు, జ్వరం తదితర వాటితో బాధపడుతున్న రోగులకు పెయిన్ కిల్లర్, యాంటిబెటిక్స్, స్టెరాయిడ్ వంటివి నిబంధనలకు విరుద్ధంగా ఇస్తున్నారు. దీంతో తక్షణ ఉపశమనం పొందుతున్న జనం ఆ తర్వాత మరింత రోగాల బారిన పడుతున్న ఘటనలు అనేకం చోటు చేసుకుంటున్నాయి.

నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు

ఆర్ఎంపీ, పీఎంపీలు ప్రజలకు ప్రథమ చికిత్స మాత్రమే చేయాలి. వైద్యులుగా చెలామణి అవుతూ ఇంజక్షన్లు, సెలైన్లు ఎక్కించడం, రక్త పరీక్షలు చేపట్టడం చట్టరీత్యా నేరం. పేరుకు ముందు డాక్టర్ అని పెట్టుకోవద్దు. క్లినిక్‌లు, మెడికల్ షాప్‌లు, ల్యాబ్‌లు ఏర్పాటు చేయరాదు. అలాగే రోగులకు ప్రిస్క్రిప్షన్ రాయడం కూడా నేరమే. నిబంధనలు ఉల్లంఘిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తాం. ప్రజలు అర్హతగల వైద్యుల వద్దనే వైద్య సేవలు పొందాలి. ఆర్ఎంపీ, పీఎంపీల వద్ద ప్రథమ చికిత్స మాత్రమే తీసుకోవాలి.

– నరేందర్ రాథోడ్, డీఎంహెచ్‌వో

క్లుప్తంగా

మత ఘర్షణకు కారణమైన ఒకరికి జైలుశిక్ష

భైంసాటౌన్: ఒక వర్గం మనోభావాలు కించపరిచేలా వ్యవహరించి మత ఘర్షణకు కారణమైన ఒకరికి రెండున్నరేళ్ల జైలు శిక్ష విధిస్తూ భైంసా ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు సోమవారం తీర్పు వెలువరించింది. పట్టణ సీఐ రాజారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... పట్టణంలోని పిప్రికాలనీకి చెందిన కాలకొండ సురేష్(పాస్టర్) 2016లో ఓ మతానికి అనుకూలంగా ప్రచారం చేస్తూ మరో మతాన్ని కించపరిచేలా వ్యవహరించాడు. దీంతో స్థానికుడైన సూర్యవంశి సాయినాథ్ ఫిర్యాదు మేరకు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో అప్పటి ఎస్సై కేసు నమోదు చేశారు. భైంసా కోర్టులో కేసు విచారణకు రాగా, ఏపీపీ అరుణ ఆరుగురు సాక్షులను ప్రవేశపెట్టడంతో నేరం రుజువైంది. ఈ మేరకు నిందితుడు కాలకొండ సురేష్‌కు రెండున్నరేళ్ల జైలుశిక్షతో పాటు రూ.5 వేల జరిమానా విధిస్తూ జడ్జి డి.దేవేంద్రబాబు తీర్పునిచ్చినట్లు సీఐ తెలిపారు. కేసు విచారణలో చురుకుగా వ్యవహరించిన ఎస్సై తిరుపతి, సీడీవో ఆఫీసర్ ఫిర్దోజ్, కేసును పర్యవేక్షించిన ఏఎస్పీ కాంతిలాల్‌పాటిల్‌ను ఎస్పీ అభినందించినట్లు తెలిపారు.

ఇసుక డంపులు స్వాధీనం



ఇసుక డంపుల వద్ద అధికారులు

దిలావర్‌పూర్: మండలంలోని కాల్వ గ్రామ పరిసరాల్లో అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంపులను సోమవారం మైనింగ్ అధికారి శ్రీకాంత్, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సంతోష్ స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వాటిని స్థానిక పంచాయతీ అధికారులకు అప్పగించారు. అక్రమంగా ఇసుక రవాణా, డంప్‌ల ఏర్పాటు చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. 13 డంపులతో పాటు, ట్రాక్టర్‌ను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌లో అప్పగించినట్లు వారు వెల్లడించారు.

ఆల్ ఇండియా పోటీలకు ఎంపిక



హాకీ పోటీలకు ఎంపికైన పోలీసులు

ఆదిలాబాద్: జిల్లాకు చెందిన ఇద్దరు పోలీసులు ఆల్ ఇండియా పోలీస్ హాకీ పోటీలకు ఎంపికయ్యారు. జమ్మూ కశ్మీర్‌లో ఈనెల 29 నుంచి వచ్చే నెల 8 వరకు నిర్వహించనున్న 72వ ఆల్ ఇండియా పోలీస్ హాకీ పోటీల్లో జిల్లాకు చెందిన అశోక్, పరమేశ్వర్ పాల్గొననున్నారు. రాష్ట్ర హాకీ జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్న వీరు సోమవారం జమ్మూ బయలుదేరి వెళ్లారు. పోటీలకు ఎంపిక కావడంపై జిల్లా హాకీ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బాలూరి గోవర్ధన్ రెడ్డి, కొరెడ్డి పార్థసారథి తదితరులు అభినందించారు.

వైద్యసేవలు మెరుగయ్యేలా..

- నిర్మల్ జిల్లాకు 161 మంది స్టాఫ్ నర్సుల ఎంపిక
- 31న సీఎం చేతుల మీదుగా నియామక పత్రాలు



ఐడెంటిటీ కార్డుల కోసం డీఎంహెచ్‌వో కార్యాలయానికి వచ్చిన స్టాఫ్ నర్సులు

నిర్మల్‌చైన్‌గేట్: ప్రభుత్వ ఆస్పత్రుల్లో నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ఖాళీగా ఉన్న స్టాఫ్ నర్సు రెగ్యులర్ పోస్టులను భర్తీ చేస్తోంది. గత ప్రభుత్వం 2022 డిసెంబర్ 30న 5,204 పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేసింది. 2023 జూలైలో వీరికి ఆన్‌లైన్ ద్వారా పరీక్ష నిర్వహించింది. తుది ఫలితాలు విడుదల చేసే సమయానికి ఎన్నికల కోడ్ రావడంతో ప్రక్రియకు తాత్కాలికంగా బ్రేక్ పడింది. ప్రస్తుతం ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎట్టకేలకు వీరి నియామకాలను చేపడుతోంది. ఇందులో భాగంగా ఆదివారం విడుదల చేసిన స్టాఫ్ నర్సుల తుది జాబితాలో జిల్లాలో 161 మంది ఎంపికయ్యారు. వీరందరికీ ఈ నెల 31న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేయనున్నారు. కాగా మెడికల్ కాలేజీలో 208, పీహెచ్‌సీల్లో 11, టీవీవీపీ పరిధిలో 70 స్టాఫ్‌నర్సు పోస్టుల ఖాళీలు ఉన్నాయి.

అత్యధికంగా ఖానాపూర్ నుంచి 24 మంది

జిల్లాలోని 18 మండలాల పరిధిలో స్టాఫ్‌నర్సు ఉద్యోగాలకు అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఎంపికైన 161 మందిలో అత్యధికంగా ఖానాపూర్ మండలం నుంచి 24 మంది, నిర్మల్ అర్బన్ నుంచి 23 మంది ఎంపికయ్యారు. అత్యల్పంగా పెంబి, దస్తురాబాద్ మండలాల నుంచి కేవలం ఇద్దరు చొప్పున మాత్రమే ఎంపికయ్యారు.

ఐడెంటీ కార్డులు అందజేత

నూతనంగా నియామకమైన స్టాఫ్ నర్సులకు ఈ నెల 31న హైదరాబాద్‌లోని లాల్‌బహదూర్ స్టేడియంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేయనున్నారు. ఇందుకు జిల్లా కేంద్రం నుంచి ఐదు బస్సులు ఏర్పాటు చేసినట్లు డీఎంహెచ్‌వో ధన్‌రాజ్ తెలిపారు. అభ్యర్థుల హాల్‌టికెట్లను సోమవారం పరిశీలించారు. అనంతరం వారికి ఐడెంటిటీ కార్డులను అందజేశారు.

మండలాల వారీగా ఎంపికైన స్టాఫ్ నర్సుల వివరాలు	
బాసర	5
ముధోల్	13
తానూర్	3
కుంటాల	3
కుభీర్	13
భైంసా	14
లోకేశ్వరం	5
నర్సాపూర్	4
దిలావర్‌పూర్	8
నిర్మల్ రూరల్	4
నిర్మల్ అర్బన్	23
సారంగాపూర్	13
మామడ	5
లక్ష్మణచాంద	5
సోన్	7
ఖానాపూర్	24
పెంబి	2
దస్తూరాబాద్	2
కడెం	8

సంతోషంగా ఉంది



స్టాఫ్ నర్సు ఉద్యోగం రావడం చాలా సంతోషంగా ఉంది. నాన్న గారు వృత్తి రీత్యా ఐసీడీఎస్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తారు. ఆయన ప్రోత్సాహంతోనే ఈ కొలువు సాధించగలిగా.

– నగం శ్రావ్య, జామ్, సారంగాపూర్

వార్డు మెంబర్ నుంచి..



ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతో జీఎన్ఎం కోర్సు పూర్తి చేశా. ఒక వైపు చదువుకుంటూనే వార్డు మెంబర్‌గా ఎన్నికయ్యా. ఇప్పుడు స్టాఫ్ నర్సుగా ఉద్యోగం రావడం నాకు చాలా సంతోషంగా ఉంది.

– దీప్తి, ముధోల్

ఒకే ఇంటి నుంచి ఇద్దరం...



స్టాఫ్ నర్సు ఉద్యోగాలకు మా తమ్ముడు నేను ఒకే సారి ఎంపిక కావడం చాలా సంతోషాన్నిచ్చింది. పేద ప్రజలకు మావంతు సహాయం చేయాలనే ఉద్దేశంతో మా నాన్నగారు మమ్మల్ని నర్సింగ్ కోర్సు చేయించారు.

– మంజూష, నాయుడువాడ, నిర్మల్

పదేళ్ల కల..



గతంలో టీఎస్‌పీఎస్సీ ద్వారా నిర్వహించిన స్టాఫ్ నర్సు నియామకాలలో ఉద్యోగం పొందలేకపోయా. ఈసారి నా భర్త ప్రోత్సాహంతో కష్టపడి చదివాను. ప్రభుత్వ కొలువు సాధించా.

– రాధ, కాల్వ, దిలావర్‌పూర్

ఉద్యోగం సాధించి చూపా



నేను బీఎస్సీ నర్సింగ్ చదివే రోజుల్లో నాకు ప్రభుత్వ ఉద్యోగం రాదని నా స్నేహితురాలు చెప్పిన మాటలు ఇప్పటికీ గుర్తున్నాయి. అదే కసితో ఎలాగైనా ప్రభుత్వ ఉద్యోగం సాధించాలని నిర్ణయించుకున్నాను. ఆమె చెప్పిన మాటలు తలుచుకుంటూనే ప్రభుత్వ ఉద్యోగం సాధించి చూపా.

– జామిడి స్వరూపరాణి, నర్సాపూర్(జి)

ఆశా వర్కర్ నుంచి ...



నేను 2008లో ఆశా వర్కర్‌గా చేరా. 2012లో ఏఎన్ఎం కోర్సు పూర్తి చేశా. భర్త ప్రోత్సాహంతో పట్టుదలతో జీఎన్ఎం కోర్సు చేశా. ప్రస్తుతం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో ఐసీయూ విభాగంలో ఔట్ సోర్సింగ్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్నా. – హేమ, స్టాఫ్ నర్సు

అమ్మ ప్రోత్సాహంతో..



అమ్మ బీడీలు చుట్టి నన్ను చదివించింది. ఆమె కష్టాలు చూసి ఎలాగైనా ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనుకున్నా. జీఎన్ఎం కోర్సు చేశా. ప్రస్తుతం జిల్లా ప్రసూతి ఆస్పత్రిలో కాంట్రాక్టు పద్ధతిలో విధులు నిర్వహిస్తున్నా.

– మావూరం రమాదేవి, నిర్మల్

నాన్న కోరిక మేరకు...



నాన్న కాంపౌండర్‌గా ప్రజలకు సేవ చేసేవాడు. నేను కూడా ఆరోగ్య శాఖలో కొలువు సాధించాలని పదేపదే చెప్పుండేవాడు. దీంతో జీఎన్ఎమ్ కోర్సు చేశా. ఐదేళ్లుగా కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తూ రోగులకు నా వంతు సేవలు చేస్తున్నా.

– బి.శృతి, నిర్మల్

జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక



జిల్లాస్థాయికి ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

జైనథ్: మండలానికి చెందిన పలువురు విద్యార్థులు స్పెల్ విజర్డ్, డ్రామా కాంపిటీషన్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జిల్లాస్థాయికి ఎంపికయ్యారు. మండలకేంద్రంలోని జెడ్పీఎస్ఎస్‌లో సోమవారం ఆయా అంశాల్లో మండలస్థాయి పోటీలు నిర్వహించారు. స్పెల్‌విజర్డ్‌లో జెడ్పీఎస్ఎస్ గూడకు చెందిన పి.శుశాంత్ ప్రథమ స్థానం, డ్రామాలో జెడ్పీఎస్ఎస్ గూడకు చెందిన శుశాంత్, సాయిప్రియ, మణితేజ, వైష్ణవి, కళ్యాణ్ ప్రథమ స్థానంలో నిలిచారు. వీరు జిల్లాస్థాయిలో నిర్వహించే పోటీల్లో పాల్గొననున్నట్లు ప్రధానోపాధ్యాయులు గజేందర్ తెలిపారు. ఇందులో ఉపాధ్యాయులు అనంత్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

నర్సింగ్ ఆఫీసర్లుగా ముగ్గురు యువకులు



రమేశ్, మల్లాపూర్



సుశాంత్, మల్లాపూర్



పాలెపు అనిల్, కల్లూరు

లక్ష్మణచాంద: రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ఆదివారం ప్రకటించిన ఫలితాల్లో మండలానికి చెందిన ఇద్దరు యువకులు ఉద్యోగాలు ఎంపికయ్యారు. మల్లాపూర్‌కు చెందిన రేని రమేశ్, మూగ సుశాంత్ నర్సింగ్ ఆఫీసర్లుగా ఉద్యోగం సాధించారు. మండల కేంద్రంలోని సహకార జూనియర్ కళాశాల అధ్యక్షుడు కొట్టూరి నారాయణ, ప్రిన్సిపాల్ కే.భోజన్న, అధ్యాపకులు జే.కిష్టయ్య, ఎం.రాజేశ్వర్, జే.శ్రీనివాస్, ఏ.రాజేశ్వర్, ఎస్.భోజన్న, గ్రామస్తులు యువకులను అభినందించారు.

కుంటాల: మండలంలోని కల్లూరుకు చెందిన పాలెపు నర్సవ్వ, సాయన్న దంపతుల కుమారుడు అనిల్ నర్సింగ్ అధికారిగా ఎంపికయ్యాడు.

ఎకరంలో స్మృతివనం ఏర్పాటు చేయాలి

- తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు పుర్క బాపూరావ్



మాట్లాడుతున్న పుర్క బాపూరావ్

ఇంద్రవెల్లి: రాష్ట్ర ప్రభుత్వం అదనంగా ఎకరం భూమి కొనుగోలు చేసి అందులో స్మృతివనం ఏర్పాటు చేయాలని తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు పుర్క బాపూరావ్ డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని అమరుల స్తూపం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏటా ఏప్రిల్ 20న అమరుల స్తూపం వద్ద ఆదివాసీలు సభలు, సమావేశాలు నిర్వహిస్తారని, అక్కడే స్మృతి వనం ఏర్పాటు చేస్తే ఇబ్బంది కలుగుతుందన్నారు. అమరుల కుటుంబాలను, ఇంద్రవెల్లి ఘటనలో గాయపడిన వారిని గుర్తించి అన్ని విధాలుగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీ ప్రాంతంలోని ఆదివాసీ గ్రామాల్లో మౌలిక సదుపాయాలు లేక ఇబ్బంది పడుతున్నారన్నారు. ఏజెన్సీలోని ఉద్యోగాలు వందశాతం ఆదివాసీలకే ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ జిల్లా ఉపాధ్యక్షుడు గేడం భరత్, మండల అధ్యక్షుడు జుగ్నాక్ భరత్, నాయకులు మడావి ఇంద్రు, చహకటి నాగోరావ్, ఆత్రం నందు, ఆత్రం ధర్ము, మెస్రం భరత్, రాందాస్, గేడం ఉమేశ్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలి



అర్జీలు స్వీకరిస్తున్న ఇన్‌చార్జి పీవో ఖుష్బూగుప్తా

ఉట్నూర్‌రూరల్: గిరిజనుల సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు చేపట్టాలని ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. సోమవారం ఐటీడీఏ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఇంద్రవెల్లి మండలం టాకిగూడకు చెందిన నగేశ్ బోరుబావి మంజూరు చేయాలని, నేరడిగొండ మండలం వాగ్దారి గ్రామానికి చెందిన రామారావు ఉపాధి కల్పించాలని, బేల మండలం సైదపూర్ గ్రామానికి చెందిన జి.థాయ్ రైతుబంధు ఇప్పించాలని, జైనూర్ మండలం ఉషేగాంకు చెందిన అన్నపూర్ణ ఔట్ సోర్సింగ్ ఉద్యోగం ఇప్పించాలని కోరారు. పింఛన్, డబుల్ బెడ్‌రూం ఇండ్లు, స్వయం ఉపాధి పథకాల మంజూరు, వ్యవసాయ, రెవెన్యూ శాఖలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలని దరఖాస్తు సమర్పించారు. కార్యక్రమంలో ఏపీవో కనక భీంరావు, ఏవో రాంబాబు, ఏపీవో పీవీటీజీ ఆత్రం భాస్కర్, పీహెచ్‌వో సందీప్, ఆర్‌వో గంగాధర్, ప్రిన్సిపాల్ మనోహర్, డీపీవో ప్రవీణ్, మేనేజర్ లింగు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రైల్వేలైన్ మంజూరు చేయాలని వినతి



పీవోకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ఉట్నూర్‌రూరల్: ఆదిలాబాద్ నుంచి కెస్లాపూర్, ఉట్నూర్, జైనూర్ మీదుగా జోడేఘాట్ నుంచి ఆసిఫాబాద్ మీదుగా కాగజ్‌నగర్ వరకు రైల్వే లైన్ మంజూరు చేయాలని కోరుతూ రైల్వేలైన్, యూనివర్సిటీ, సాధన కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో ఖుష్బూ గుప్తాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉట్నూర్ డివిజన్ కేంద్రం అన్ని రంగాల్లో వెనుకబడి ఉందన్నారు. ఉట్నూర్ కేంద్రంగా అగ్రికల్చర్, డెంటల్, వెటర్నరీ యూనివర్సిటీ మంజూరు చేయాలని, ఏజెన్సీ గ్రామాలకు శాశ్వతంగా సాగు, తాగు నీటి పరిష్కారం చూపాలని కోరారు. కార్యక్రమంలో భరత్ చౌహాన్, బానోత్ రామారావు, నేతావత్ రాందాస్, గోపాల్‌రావు, కట్ట లక్ష్మణాచారి, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

కుష్ఠు రహిత సమాజానికి కృషి చేయాలి

- జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి జీసీ.సుబ్బారాయుడు



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో సుబ్బారాయుడు

పాతమంచిర్యాల: కుష్ఠువ్యాధి రహిత సమాజ నిర్మాణం కోసం అందరూ కృషి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి జీసీ.సుబ్బారాయుడు అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో కుష్ఠు వ్యాధి నిర్మూలన అవగాహన పోస్టర్లు, కరపత్రాలను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'స్పర్శ్ లెప్రసీ అవేర్‌నెస్' కార్యక్రమంలో భాగంగా జిల్లాలో జనవరి 30 నుంచి ఫిబ్రవరి 13 వరకు కుష్ఠు వ్యాధి నిర్మూలనపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. జనవరి 30న మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా గ్రామాల్లో ప్రత్యేకంగా గ్రామసభలు నిర్వహించి వ్యాధి లక్షణాలు, నివారణ మార్గాలపై అవగాహన కల్పించి కుష్ఠు నివారణకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేయించాలన్నారు. మిగతా రోజుల్లో పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు డాక్టర్ నీరజ, డాక్టర్ అనిత, జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్లు, కమ్యూనిటీ హెల్త్ అధికారి లింగారెడ్డి, డీపీఎంవోలు శివకుమార్, రాఘవయ్య, హెల్త్‌అసిస్టెంట్ సునీల్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

నిర్మల్‌టౌన్: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన సోమవారం జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. ఏఎస్సై హన్మండ్లు తెలిపిన వివరాల ప్రకారం.. నేరడిగొండ మండలం బుద్దికొండ గ్రామానికి చెందిన జక్కుల వంశీ స్థానికంగా ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో పనిచేస్తున్నాడు. సోన్‌లోని ఓ పాఠశాలలో చదువుకుంటున్న తన మేనల్లుడిని బైక్‌పై తీసుకువచ్చే క్రమంలో సోఫీనగర్ వద్ద అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొన్నాడు. తీవ్రగాయాలు కావడంతో వంశీ అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్సై తెలిపారు.

కానిస్టేబుల్‌పై దురుసుగా ప్రవర్తించిన వ్యక్తి రిమాండ్

దహెగాం: పోలీసులపై దురుసుగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై సనత్‌కుమార్ తెలిపారు. ఈ నెల 24న మండలంలోని కమ్మర్‌పల్లి గ్రామానికి చెందిన నేరెళ్ల జ్యోత్స్న తన భర్త తాగి గొడవ చేస్తున్నాడని 100కు డయల్ చేసింది. విధుల్లో ఉన్న కానిస్టేబుల్ సంతోష్ గ్రామానికి వెళ్లి విచారణ చేస్తుండగా సదరు మహిళ భర్త దత్తాత్రేయ కానిస్టేబుల్‌పై దురుసుగా ప్రవర్తించడంతో పాటు అతని బైక్‌ను ధ్వంసం చేశాడు. కానిస్టేబుల్ సంతోష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని సోమవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

ఇరువురిపై కేసు

కాసిపేట: మండలంలోని కోమటిచేను శివారులో చికెన్ సెంటర్ నిర్వాహకుడు రాంటెంకి శివరాం, డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ప్రవీణ్‌నాయక్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై గంగారాం తెలిపారు. సోమవారం చికెన్ సెంటర్ ముందు పొయ్యిల కట్టెలు పెడితే ఇక్కడ ఎందుకు పెట్టావ్ అంటూ కర్రతో దాడి చేయడంతో గాయాలైనట్లు శివరాం ఫిర్యాదు చేశాడు. ఇదే సంఘటనపై రెండురోజుల క్రితం పొయ్యిల కట్టెలు రోడ్డు మీద కాకుండా వెనకాల ఉంచుకోవాలని చెప్పానని, సోమవారం కూడా కట్టెలు ఎందుకు ఉంచావని ప్రశ్నించడంతో బూతులు తిడుతూ బైక్ కీ లాక్కుని సెల్‌ఫోన్ కిందపడేశాడని డిప్యూటీ రేంజ్ అధికారి ప్రవీణ్‌నాయక్ ఫిర్యాదు చేశాడు. ఇరువురి ఫిర్యాదులు స్వీకరించి ఇద్దరిపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

హత్య కేసులో ఏడేళ్ల జైలు

ఆసిఫాబాద్‌అర్బన్: హత్య కేసులో ఒకరికి ఏడేళ్ల జైలుశిక్ష విధిస్తూ ఆసిఫాబాద్ జిల్లా సెషన్స్ కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎంవీ.రమేశ్ సోమవారం తీర్పునిచ్చారు. కోర్టు లైజనింగ్ అధికారి ఎస్సై కె.సాగర్, కాగజ్‌నగర్ సబ్ డివిజన్ లైజనింగ్ అధికారి బాబాజీ (హెడ్ కానిస్టేబుల్) తెలిపిన వివరాల ప్రకారం 2022లో కాగజ్‌నగర్‌లోని గుంటూరు కాలనీకి చెందిన మునిగెల సదానందంను సర్‌సిల్క్ కాలనీకి చెందిన ఉయ్యాల గోపి హత్య చేయడంతో కేసు నమోదైంది. పీపీ జగన్‌మోహన్ కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టగా నేరం రుజువు కావడంతో నిందితునికి ఐపీసీ సెక్షన్ 302 ప్రకారం ఏడేళ్ల జైలు శిక్ష విధించారు.

ఘర్షణలో ట్రాక్టర్ యజమాని మృతి



శ్రీధర్ మృతదేహం

బెల్లంపల్లి: ఇటుక, మట్టి ట్రిప్పుల చార్జీల వసూలు విషయంలో ఇద్దరు ట్రాక్టర్ యజమానుల మధ్య జరిగిన ఘర్షణలో ఒకరు మృతి చెందిన ఘటన సోమవారం బెల్లంపల్లిలో కలకలం రేపింది. వన్ టౌన్ ఎస్‌హెచ్‌వో దేవయ్య, సహచర ట్రాక్టర్ ఓనర్లు తెలిపిన వివరాల ప్రకారం బెల్లంపల్లి మున్సిపాలిటీ హన్మాన్ బస్తీకి చెందిన గాజవేని సంపత్ అలియాస్ శ్రీధర్ (40), రాంనగర్‌బస్తీలో నివాసం ఉంటున్న మహ్మద్ ఖాజా మోహినొద్దీన్ కొంతకాలంగా ట్రాక్టర్ ట్రిప్పుల దందా నిర్వహిస్తున్నారు. ట్రాక్టర్ ట్రిప్పుల చార్జీ వసూలు విషయంలో మూడురోజులుగా ఇద్దరూ తగాదా పడుతున్నారు. ట్రిప్పుకు రూ.50 తగ్గించి ట్రాక్టర్ చార్జీ తీసుకుంటున్నాడని ఖాజా మోహినుద్దీన్ బాబుక్యాంపు బస్తీకి వెళ్లే మార్గంలో సోమవారం శ్రీధర్‌ను నిలదీయడంతో ఇద్దరి మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. సెంట్రింగ్‌కు సపోర్టుగా వాడే కర్రతో శ్రీధర్ తలపై బలంగా బాదడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. వన్ టౌన్ ఎస్సై రమేశ్, ఏఎస్సై తిరుపతి మృతదేహాన్ని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలోని మార్చురీకి తరలించారు. మృతునికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. మృతుని సోదరుడు గాజవేని శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

ఆటో బోల్తాపడి డ్రైవర్‌కు గాయాలు



గాయపడిన వెంకటేష్

రెబ్బెన(ఆసిఫాబాద్): అదుపుతప్పి ఆటో బోల్తా పడిన ఘటనలో డ్రైవర్‌కు తీవ్రగాయాలైన సంఘటన సోమవారం మండలంలోని రాంపూర్ బస్టాండ్ సమీపంలో చోటు చేసుకుంది. ఎస్సై చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం సిర్పూర్(టి) మండలంలోని శివపురం గ్రామానికి చెందిన బట్టు వెంకటేష్ పనినిమిత్తం తన ఆటోలో మంచిర్యాలకు బయలుదేరాడు. మార్గమధ్యలో రాంపూర్ బస్టాండ్ సమీపంలో ఆటో అదుపుతప్పి బోల్తాపడింది. ఘటనలో వెంకటేష్ తలకు తీవ్రగాయాలు కావడంతో 108లో కాగజ్‌నగర్‌కు తరలించారు. మెరుగైన వైద్యం కోసం కుటుంబ సభ్యులు మంచిర్యాలకు తరలించి చికిత్స అందిస్తున్నట్లు ఎస్సై తెలిపారు. సిర్పూర్(టి)కి చెందిన దుర్గం ప్రవీణ్ అందించిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

విచారించకుండానే కేసు, రిమాండ్

- రహదారిపై బాధిత కుటుంబ సభ్యుల ఆందోళన
- న్యాయం చేయాలని డిమాండ్



రాస్తారోకో చేస్తున్న కుటుంబ సభ్యులు

దండేపల్లి: అన్యమత మార్పిడి విషయంలో జరిగిన వివాదంలో పోలీసులు విచారణ చేపట్టకుండానే కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపడంతో బాధిత కుటుంబ సభ్యులు, బంధువులు ఆందోళనకు దిగారు. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని లింగాపూర్‌కు చెందిన నంది సుమను మత మార్పిడి చేస్తే అంతా మంచే జరుగుతుందని గ్రామానికి చెందిన కొందరు అన్యమతస్తులు ఒత్తిడి చేశారు. విషయాన్ని భర్త నరేష్‌కు తెలపడంతో ఈ నెల 27న చర్చి పాస్టర్, ఒత్తిడి చేసిన వారితో వాగ్వాదానికి దిగాడు. ఇంతలో నరేష్ తమ్ముడు సురేష్ అక్కడకు చేరుకుని ఎందుకు గొడవ చేస్తున్నారని అనడంతో పాస్టర్‌తో పాటు అన్యమతస్తులు అతన్ని చితక బాదారు. అంతే కాకుండా ఇద్దరిపై దండేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఎస్సై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. గతంలో గ్రామానికి చెందిన కొందరు సురేష్‌పై కత్తులతో దాడిచేస్తే 20 రోజుల తర్వాత కేసు నమోదు చేసిన పోలీసులు ఘటనపై ఇంత తొందరగా స్పందించడంపై బాధిత కుటుంబ సభ్యులు మండిపడ్డారు. పోలీసుల తీరుకు నిరసనగా సోమవారం దండేపల్లి అంబేద్కర్ స్టాచ్ సమీపంలో రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేశారు. ఎస్సై ప్రసాద్ వారికి నచ్చజెప్పి ఆందోళన విరమింప చేయించారు. కాగా గతంలో దాడి కేసు ఆలస్యంపై ఎస్సైని సంప్రదించగా మెడికల్ రిపోర్ట్ రావడంలో జాప్యం కావడంతోనే కేసు నమోదు చేయడంలో కొంత ఆలస్యం జరిగిందన్నారు. అనంతరం ఆందోళనకారులు తహసీల్దార్ సంధ్యారాణికి విన్నవించారు.

వేటగాళ్ల అరెస్టు



నిందితుల అరెస్ట్ చూపుతున్న అధికారులు

సిర్పూర్(టి): సిర్పూర్(టి) రేంజ్ పరిధిలోని చీలపల్లి ఈస్ట్ బీట్‌లో చుక్కల దుప్పిని హతమార్చిన వేటగాళ్లను అటవీశాఖ అధికారులు అరెస్ట్ చేశారు. సోమవారం కార్యాలయంలో అధికారులు వివరాలు వెల్లడించారు. దుప్పిని హతమార్చిన నలుగురు నిందితుల్లో ప్రధాన నిందితుడు ఎండీ షాకీర్ పరారీలో ఉండగా దుర్గం సునీల్, దుర్గం సాయి, చెర్ల రాహుల్‌ను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. నిందితులను సిర్పూర్ కోర్టులో హాజరుపరచగా 14 రోజుల రిమాండ్ విధించినట్లు తెలిపారు. వేటగాళ్లను ఆసిఫాబాద్ జైలుకు తరలించినట్లు వారు పేర్కొన్నారు.